




మార్కెట్‌కు చవితి శోభ

వినాయక చవితి నేపథ్యంలో ఆదివారం నగరంలో మార్కెట్లకు జనం పోటెత్తారు. పండగ సామగ్రి కొనుగోలుకు నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి రావడంతో గంటస్తంభం మార్కెట్ కిటకిటలాడింది. – ప్రజాశక్తి, విజయనగరంకోట

లక్ష్యానికి అనుగుణంగా పంట రుణాలు



ఈ ఏడాది లక్ష్యానికి అనుగుణంగా ఖరీఫ్ పంట రుణాలు అందజేస్తున్నామని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. సిసిఆర్‌సి కార్డులున్న కౌలుదారులకు రుణ సాయం అందజేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 11,195 మందితో కూడిన సిసిఆర్‌సి కార్డుదారుల జాబితాను రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తమకు అందజేశారని, వాటిని బ్యాంకు శాఖలకు ఇప్పటికే పంపామని వివరించారు. ఈ ఏడాది పిఎంఇజిపి పథకం కింద 121 యూనిట్లకు రూ.3.11 కోట్లు సబ్సిడీ పంపిణీ చేసినట్లు తెలిపారు. చిరువ్యాపారాలు, ఫుట్ ప్రాసెసింగ్ యూనిట్లకు బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- సిసిఆర్‌సి కార్డుల ద్వారా కౌలుదారులకు సాయం
- పిఎంఇజిపి 121 యూనిట్లకు రూ.3.11 కోట్లు సబ్సిడీ
- చిరువ్యాపారాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అవకాశం
- 'ప్రజాశక్తి'తో లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.శ్రీనివాసరావు ముఖాముఖి

ఈ ఏడాది పంటరుణాల లక్ష్యం ఎంత, ఏ మేరకు అందజేశారు.?

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పంట రుణాల లక్ష్యం రూ.3,432 కోట్లు కాగా, ఖరీఫ్‌లో రూ.2,025 కోట్లు, రబీలో రూ.1,407కోట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఖరీఫ్ రుణాలకు సంబంధించి జులై నెలాఖరు వరకు 1,525 కోట్ల (75శాతం) మేర రైతులకు పంపిణీ చేశాం. ఆగస్టు, సెప్టెంబర్ నెల రిపోర్టు ఇంకా రావాల్సి ఉంది. ఇప్పటి వరకు సుమారు 85 శాతంగా రుణసాయం అందినట్టుగా అంచనా. గత ఏడాది ఖరీఫ్‌లో రూ.2016 కోట్ల మేర ఇచ్చాం.

చిరువ్యాపారులకు సాయం అందించే పథకాలు ఏమైనా ఉన్నాయా.?



చిరువ్యాపారులతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కూడా వివిధ పథకాలు ఉన్నాయి. ముఖ్యంగా చిరువ్యాపారుల కోసం పిఎం సన్నిధి పథకం ఉంది. ఈ పథకం కింద తొలి ఏడాది రూ.10 వేలు రెండో ఏడాది రూ.20 వేలు, మూడో ఏట రూ.30 వేలు చొప్పున ప్రభుత్వం తరపున బ్యాంకు రుణాలు పొందవచ్చు. వీటిని వాయిదాల పద్ధతిలో తీర్చితే ఆ తరువాత కూడా రుణసాయం పొందవచ్చు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 13,856 దరఖాస్తులు అందగా, 10,987 మందికి రుణసాయం అందించాం. మిగిలినవి పరిశీలనలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం పొందని వారికి మాత్రమే ఈ పథకం పొందేందుకు అవకాశం ఉంది.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఎంతమొత్తంలో రుణసాయం పొందవచ్చు.?

ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఇ) పథకం ద్వారా రుణసాయం పొందేందుకు అవకాశం ఉంది. లబ్ధిదారుడు పెట్టే యూనిట్‌ను బట్టి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణం పొందేందుకు అవకాశం ఉంది. 35 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ పథకం కింద ఈ ఏడాది ఇప్పటి వరకు 166 యూనిట్లను మంజూరు చేయగా, 114 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి.

పిఎంఇజిపి ద్వారా ఎంతమందికి, ఎంతమేర రుణసాయం అందించారు.?

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ఏడో తేదీ వరకు పిఎంఇజిపి ద్వారా 409 మందికి వివిధ రంగాల్లో ఉత్పత్తి, సేవారంగాల్లో ఉపాధి కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 121 యూనిట్లకు రూ.3.11 కోట్ల వరకు సబ్సిడీ విడుదల చేశాం. ఈ రుణసాయంలో పట్టణ ప్రాంతంలో 25 శాతం, గ్రామీణ ప్రాంతంలో 35 శాతం చొప్పున సబ్సిడీ వర్తిస్తుంది.

పిఎంఇజిపి ద్వారా ఎంత మేర రుణసాయం పొందవచ్చు.?

తయారీ రంగంలో రూ.50 లక్షలు, సేవారంగంలో రూ.20 లక్షల వరకు మంజూరు చేస్తారు. ప్రాజెక్టు వ్యయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలను బట్టి 25శాతం నుంచి 35శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ ఉంటుంది. లబ్ధిదారుని వాటాగా 5నుంచి 10శాతం చెల్లించాలి. మిగిలిన మొత్తం వాయిదాల పద్ధతిలో బ్యాంకుకు కట్టాలి.

పిఎంఇజిపికి అర్హత ఏమిటి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి.?

18 ఏళ్లు నిండిన వారంతా ఈ పథకానికి అర్హులే. వ్యక్తిగత ఆదాయ పరిమితి అంటూ లేదు. రూ.10 లక్షలకు పైగా పెట్టుబడిగల తయారీ రంగ పరిశ్రమలకు, రూ.5 లక్షలు దాటిన సేవారంగ పరిశ్రమలకు కనీస విద్యార్హత 8వ తరగతి. నూతనంగా ప్రారంభించిన పరిశ్రమలకు మాత్రమే ఈ పథకం ద్వారా సబ్సిడీ పొందే అవకాశం ఉంటుంది. దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.

కౌలుదారులకు రుణసాయం అందుతుందా.?

బ్యాంకు నిబంధనలకు లోబడి కౌలుదారులందరికీ రుణసాయం అందజేసేందుకు చర్యలు తీసుకున్నాం. జిల్లా వాప్తంగా 11,195 మంది కౌలుదారులకు సిసిఆర్‌సి (క్రాఫ్ కల్టివేషన్ రైట్స్ కార్డు)లు అందజేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. వీరందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని జిల్లాలో సుమారు 10 బ్యాంకులకు సూచించాం. వీటి పరిధిలోని బ్యాంకు శాఖల ద్వారా రైతులు ఆయా కార్డులు చూపించి రుణసాయం పొందవచ్చు.



బాడంగి... సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

హక్కులను హరిస్తున్న పాలకులు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-బాడంగి

కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర పాలకులు హరిస్తున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం సిఐటియు మండల విస్తృత స్థాయి సమావేశాన్ని మండల నాయకులు రవణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులపైన తీవ్రమైన భారాలను మోపుతుందన్నారు. కంపెనీల్లో సంఘం పెట్టుకొనే అవకాశం లేకుండా, కార్మిక సమస్యలపై పోరాటాలు చేయకుండా కుట్ర పన్నుతున్నాయని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి కార్మికులు కూడా ఓట్లేసి గెలిపించారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ఇచ్చిన హామీలను మర్చిపోయారని విమర్శించారు. కార్మికులకు నష్టం చేకూర్చే విధానాలను తీసుకొస్తే భవిష్యత్తులో ప్రధాని మోడీని ఇంటికి పంపించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్మికులకు అండగా సిఐటియు పోరాటం సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎ.సురేష్, ఎస్.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : తెర్లాంలో ఆదివారం కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం కార్మికులకు ఇవ్వకపోగా, కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మార్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సామాన్య కుటుంబం ఈరోజుల్లో జీవించాలంటే కనీసం నెలకు రూ.26 వేలు ఖర్చవుతుందని అనేక కమిటీలు అంచనాలు వేశాయని, కానీ స్కీమ్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న పాలకులు కనీస వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడి హక్కులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమానికి సిఐటియు మండల నాయకులు ఎస్.గోపాలం, జి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా బిసి సంక్షేమాధికారి యశోదనరావు, తదితరులు

విశ్వకర్మ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. బిసి సంక్షేమ అధికారి యశోదన రావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జాన వెంకట వరప్రసాద్, జిల్లా అధ్యక్షులు కిల్లంపల్లి ఆచారి, ఉపాధ్యక్షులు ఈశ్వరరావు.. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

విజయనగరం టౌన్ : స్థానిక రామారాయుడు రోడ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాలుగో డివిజన్లో బధిర పాఠశాల ప్రాంతంలో విశ్వకర్మ జయంతి వేడుకలలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వనరులను అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

విజయనగరం టౌన్ : విజయనగరంలోని పలువురు క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ టీ షర్టులు, ట్రాక్‌లు అందజేశారు. ఆదివారం నగరంలోని కోలగట్ల నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని ఈశ్వర్ కౌశిక్ అందజేశారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన కోరారు.

ప్రాథమిక హక్కులకు విఘాతం

ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నిరంకుశ చర్యల ద్వారా ప్రాథమిక హక్కులకు వైసిపి ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని వక్తలు తెలిపారు. రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. స్థానిక అమర్‌భవన్‌లో ఆదివారం సిపిఐ ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడుతూ గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించిన సిఎం జగన్.. తన దృష్టి అభివృద్ధిపై చూపిస్తే ప్రజలు సంతోషించే వారన్నారు. నాలుగున్నర ఏళ్ల పాలనలో రహదారులు వేశారా? కాలువలు కట్టించారా? మౌలిక సదుపాయాలు కల్పించారా? అని ప్రశ్నించారు. ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా క్షీణించాయని చెప్పారు. ధరలు విపరీతంగా పెరిగాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం కాక.. కక్ష సాధింపు పాలన మీదే జగన్ దృష్టిసారిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చివేసి ఆయన సాధించింది ఏమిటని ప్రశ్నించారు. సామాన్యులను సైతం ఇబ్బందులు పెడుతున్నారని గుర్తు చేశారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగార్జున

అనంతరం సిపిఐ రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతల పట్ల, ప్రజా ఉద్యమాల పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఖండించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం హిట్లర్ పరిపాలన కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను ఏదో ఒక విధంగా తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించడం దారుణమన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుతో కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని ప్రజలందరికీ అర్థమైందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు వస్తూ పోతూ ఉంటారని, అధికారం శాశ్వతం కాదని హితవుపలికారు. చంద్రబాబు అరెస్టు విషయంలోనూ చట్టబద్ధంగా వ్యవహరించలేదని తప్పుబట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీమ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు దయానంద్, జనసేన పార్టీ నాయకులు రాజు, తదితరులు మాట్లాడారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, పలు సంఘాల నాయకులు బి.పావని, బి.రమణమ్మ, బి.వాసు, కె.అప్పన్న, గోక రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

19న నగరంలో విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 19న విజయనగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ నగర్ ఫీడర్ మరమ్మతులు, విద్యుత్తు లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం కోసం మంగళవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. నగరంలోని బుచ్చన్నకోనేరు, శాంతినగర్, పైనలవీధి, రైల్వేబ్రిడ్జ్ ప్రాంతం, రాళ్లవీధి, బిటిఆర్ కాలనీ, సంజీవనగర్ కాలనీ, కొండపల్లివారితోట, గాజులరేగ వాటర్ వర్క్స్ ఏరియా, మైత్రీనగర్, అగురువీధి, సాయిబాబా కోవెల ఏరియా, ఆదిత్య లేఅవుట్, పడాలవీధి, సత్య లేఅవుట్, సప్తగిరి లేఅవుట్, కార్తిక మానస లేఅవుట్, వైయస్ఆర్ నగర్, తదితర ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపేస్తామని ఆయన వెల్లడించారు. విద్యుత్తు అంతరాయానికి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న జెఎసి నాయకులు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుకు వేతన పెంపుతో పాటు ప్రత్యేక సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి మహాసభ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రెవెన్యూ భవనంలో జిల్లా స్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాజనసభ జరిగింది. ఎపి జెఎసి అమరావతి ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ చైర్మన్ భానుమూర్తి, జెఎసి ఉపాధ్యక్షులు గోవిందు, ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కోశాధికారి గుర్నాథ్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ వేతనానికి, సమయపాలన లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా ముందుకు సాగాలని సూచించారు.

గిరి శిఖర గ్రామాల్లోగజరాజులు సంచారం

కురుపాం : మండలంలో గిరిశిఖర గ్రామమైన జరడలో నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తుంది. ఇటీవల సీతంపేట, భామిని అటవీ ప్రాంతాల్లో సంచరించిన ఈ ఏనుగుల గుంపు గత కొద్దిరోజులుగా నీలకంఠాపురం, జరడ ఏజెన్సీ ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ఫలసాయాలు నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, నిత్యం కొండ ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తుందని ఏ క్షణాన ఏం జరుగుతుందని భయభ్రాంతులకు గురవుతున్నామని గిరిజనులు చెబుతున్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ప్రజలకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విజయ దుర్గ యూత్ సొసైటీ, విజయ బ్లడ్ బ్యాంక్, విజయనగరం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జి శ్రీనివాసరావు నివాసం వద్ద 'పర్యావరణాన్ని కాపాడుదాం.. మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం' అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయ దుర్గ యూత్ సొసైటీ ప్రెసిడెంట్ కె.చంద్రిక చందు, సభ్యులు పూర్ణ, హారిక, యమున, స్వాతి, విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శివ, యశ్వంత్, కుమార్, విజయనగరం యూత్ ప్రెసిడెంట్ షేక్. ఇల్తామాష్, శరత్, సాయి, రాము, అశోక్ కిరణ్ పాల్గొన్నారు.

డిసిఎంఎస్ కార్యాలయంలో సిబ్బందికి, కళాసీలకు చైర్‌పర్సన్ అవనాపు భావన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ బి.వి.ఎస్ సాయికుమార్, అకౌంటెంట్ రాఘవులు, సేల్స్ మేనేజర్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక బ్యాంకు కాలనీ వద్ద బాలాజీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రామరాజు, కార్యదర్శి నాగలక్ష్మి, కోశాధికారి సింహాచలం పాల్గొన్నారు

రింగ్‌రోడ్డులో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతుల ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం, అవోపా ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, వజ్రపు కృష్ణారావు, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, పి.రామారావు పాల్గొన్నారు.

విజయనగరం కోట : లయన్స్ కమ్యూనిటీ హాల్ వద్ద లయన్స్ క్లబ్, స్పార్క్ సొసైటీ సంయుక్తంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశాయి. కార్యక్రమంలో సభ్యులు శివ ప్రసాద్ రెడ్డి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.





పర్యావరణ పరిరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ; మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన దంపతులు



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కొత్తఅగ్రహారంలోని రోటరీ సామాజిక భవనంలో ఆదివారం ఏర్పాటుచేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 50 యూనిట్ల రక్తాన్ని సేకరించి, రోటరీ బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానానికి యువత ముందుకు రావాలని రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అంచాలియా కోరారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి డాక్టర్ డి.రాధికారాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని తోటపాలెంలో ప్రయివేటు కళ్యాణ మండపంలో కిసాన్ శ్రామిక తత్సంగ్ సహకారంతో 72 మంది రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త విశాలాక్షి, వ్యవసాయ శాఖ బాపట్ల జిల్లా అధికారి కె.లక్ష్మినరసింహం, జిల్లా పోలీస్ అడ్వయిజర్ పరశురాం అతిథులుగా పాల్గొని రైతులను సత్కరించారు. మజ్జి గురునాయుడు ఆధ్వర్యంలో సభ్యులు పామోటి చిన్నంనాయుడు, సైలాడ ఈశ్వరరావు, కంది వెంకటరమణ, ఆర్లే కృష్ణారావు సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.


బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

తుమ్మికాపల్లిలో గడపగడపకు..

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లిలో ఆదివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపిటిసి పిల్లా లక్ష్మి, ఈశ్వర్ రావు, పిల్లా అచ్చులు, అప్పికొండ సన్యాసిరావు, పెడిరెడ్ల సూరిబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్పులను కోర్టులు చెప్పాలి

ప్రజాశక్తి- గజపతినగరం

చంద్రబాబు నాయుడు అరెస్ట్ అక్రమమా? సక్రమమా? అనే తీర్పు కోర్టులు చెప్పాలి కానీ, ఆ రెండు పత్రికలు కాదని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మండిపడ్డారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆ రెండు పచ్చ పత్రికలు పై ఫైర్ అయ్యారు. చంద్రబాబు అరెస్ట్ కక్షసాధింపు చర్యకాదని, చట్టపరమైన చర్య అని అన్నారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు నాయుడు పాత్ర లేకపోతే కోర్టు ఎందుకు రిమాండ్ విధించిందని ప్రశ్నించారు. దేశంలోనే పేరు మోసిన న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఎందుకు బెయిల్ తెప్పించలేకపోయారని, కేసులో చంద్రబాబు పాత్ర ఉంది కాబట్టి ఆ న్యాయవాది చేతులెత్తేసారని అన్నారు. చంద్రబాబు ఉత్తముడని ఆ రెండు పచ్చ పత్రికలు చెప్పినంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. తమ తప్పుడు రాతలతో చంద్రబాబుకు మేలు చేయాలని ఆ రెండు పత్రికలు కిందా మీద పడుతున్నాయని విమర్శించారు. ప్రజల్లో సానుభూతి కోసం టిడిపి శ్రేణులు నిరసనలు, దొంగ దీక్షలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం పలికారు. చంద్రబాబు ఆరోపణలు రావడంతో సెంట్రల్ గవర్నమెంట్ ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్, జి.ఎస్.టి అధికారులు పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేశారన్నారు.ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జెడ్‌పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షు బూడి వెంకటరావు, వైసిపి నాయకులు బెల్లాన త్రినాధ రావు, మండల సురేష్, రేగ సురేష్, కరణం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా గిరి ఒలిపిక్స్ క్రీడలు

ప్రజాశక్తి - సీతంపేట

ఒలింపిక్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు స్థానిక ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి, ఎస్ఐ ఎ.నీలకంఠ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు మండల స్థాయి నుండి జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుండి 50 టీములు పాల్గొన్నాయి. ఈ ఒలింపిక్స్‌లో ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఎన్.జాకబ్ దయానంద్, ఇంటర్నేషనల్ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ సూరిబాబు, మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, సురేష, మధు, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో పేద రోగులకు ఆదివారం రాష్ట్ర మత్స్యకార నెయ్యిల కుల సంఘం నాయకులు టెక్కలి ధర్మారావు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తన కుమార్తె టి.హిమబిందు 4వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం పేద రోగులకు ఆహారం అందజేశారు. పట్టణానికి సాలూరు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతిరోజూ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు ఆహార పొట్లాలు పంపిణీ పంపిణీ చేస్తున్నారు.

గిరిజనులను కాపాడాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించి వారి స్థితిగతులను మార్చాలని సిపిఎం నాయకులు కొల్లేసాము మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం చినఖర్జేల పంచాయతీ సీసాడ వలసలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ వర్షం పడితే ఈ గ్రామమంతా ఊటనీరుతో నిండిపోయి విష జ్వరాలతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కాలువలు, సిసి రోడ్లు లేకపోవడంతో నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటుందన్నారు. తక్షణమే ఈ గ్రామానికి సిసి రోడ్డు, కాలువలు మంజూరు చేసి, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబాలకు భరోసా కల్పించాలని ఈ సందర్భంగా సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కోరారు. కార్యక్రమంలో చిలకమ్మ, సోములు, రాజేష్, పకీరు పాల్గొన్నారు.

అవార్డు రావడం అభినందనీయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపకులు, కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బోయి భీమన్న అవార్డు రావడం అభినందనీయమని శ్రీశ్రీ కళావేదిక మన్యం జిల్లా అధ్యక్షులు పాలక దేవానంద్ అన్నారు. కత్తిమండ కళలను, కళాకారులను, కవులను ప్రోత్సహించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేయడం వారి ఆదర్శానికి నిదర్శనమన్నారు. కత్తిమండకు అవార్డు రావడం పట్ల గౌరవాధ్యక్షులు వాసుదేవరావు, ముఖ్య సలహాదారి బాలకృష్ణ, కార్యదర్శులు నిర్మల్‌కుమార్, హరి గోపాల్, సభ్యులు శేషగిరి, శేఖర్, సూర్యనారాయణ, జనరల్ సెక్రెటరీ శైలజా అభినందించారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

ప్రజాశక్తి- బొబ్బిలి

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా పర్యావరణ హిత మట్టి వినాయకుని పూజించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం బొబ్బిలి పట్టణంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని ప్రతిమలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సాయి సర్వాణి కాలనీలో మట్టి వినాయక విగ్రహాలను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సత్యంనాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనమిత్ర, గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు కె.కృష్ణదాసు, ఎస్వి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

శృంగవరపుకోట: మండలంలోని భవాని నగర్‌లోని గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకటరామ, బోని నరేష్, సుంకరి నాని పాల్గొన్నారు. గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో భోగాపురం గ్రామంలో ప్రసన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో బొద్దాం గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సిమ్ బొద్దాం శాఖ కార్యదర్శి కర్రి కేశవరత్న కుమారి ప్రారంభించారు. జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ వివిధ రకాల రసాయనాలతో తయారుచేసిన వినాయక విగ్రహాల వల్ల జలవనరులు కాలుష్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యమ్.సూర్యకాంత్, యేడువాక రవి, శ్రావణి, హృషీకేష్, లాస్యశ్రీ, లవిత్ పాల్గొన్నారు. **కొత్తవలస :** మండల కేంద్రంలో తుమికాపల్లి గ్రామంలో పరదా పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వానదు హరికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవి, లీగల్ అడ్వైజర్ గవర కృష్ణ, ట్రస్టు సభ్యులు నగేష్, వినాయక నగర్ సభ్యులు కొప్పిశెట్టి రమణ, మెడికల్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: పర్యావరణ హితమైన మట్టి ప్రతిమలతో వినాయక చవితి పూజలు జరుపుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం రామభద్రపురం గ్రామీణ బ్యాంక్ వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్ఐ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, రోటరీ క్లబ్ కోశాధికారి రొటేరియన్ శ్రీనివాసన్ ఆర్థిక సహకారంతో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


బొబ్బిలి: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రామభద్రపురం: మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న జెసి రాజు, తదితరులు

గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కాలుష్యం నివారణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రజలు, భక్తులకు సందేశాన్ని ఇవ్వడానికి పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. మట్టితో తయారు చేసిన విగ్రహానికి రంగులు వేసి వినాయక పూజలు చేసేందుకు విద్యార్థులు సిద్ధం చేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రఘునందన్ అభినందించారు.


విగ్రహానికి రంగులు వేస్తున్న విద్యార్థులు

మిమ్స్‌లో ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మహారాజా వైద్య విజ్ఞాన సంస్థ జనరల్ (మిమ్స్) ఆసుపత్రిలో నుంచి ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మిమ్స్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.వేణు గోపాల్ తెలిపారు. ఆదివారం జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ప్రపంచం రోగుల భద్రతా దినోత్సవాలు మిమ్స్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మిమ్స్ అకడమిక్ డైరెక్టర్ మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 25వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవాలను పురస్కరించుకొని మొదటి రోజు రోగులను వారి భద్రత పై నిమగ్నం చేయడం, హక్కులు, బాధ్యతలు, సలహాలు, ఫిర్యాదులు వంటి అంశాల పై అవగాహన కల్పించడం, రెండవ రోజున మాక్ డ్రిల్, మూడవ రోజున మందుల భద్రత (మెడికేషన్) కాలం చెల్లిన మందులు, హై రిస్క్ మందులు, యాంటీ బయాటిక్స్ పాలసీ వంటి అంశాల పై, నాల్గవ రోజున ప్రపంచం ఆరోగ్య సంస్థ నిభందలననుసరించి చేతుల పరిశుభ్రత డిజిటల్ శిక్షణ, అయిదవ రోజున విద్యార్థులు మధ్య గోడ పత్రికలు నినాదాలు పై పోటీలు థీమ్స్ ఆఫ్ పోస్టర్, స్లొగన్ ఆన్ ఏడవ అంతర్జాతీయ రోగులు భద్రతా లక్ష్యాలు పై పోటీలు, ఆరవ రోజున (22) వ్యాధి సంక్రమణ నియంత్రణ, రికార్డులు భద్ర పరుచడం, తనిఖీ సౌకర్యం, రోగి భద్రతా లక్ష్యాలు పై ఉత్తమ శాఖ (బెస్ట్ డిపార్ట్ మెంట్) పోటీలు నిర్వహిస్తామన్నారు. కాగా ఈ కార్యక్రమాలు మిమ్స్ ఆసుపత్రి నాణ్యత ప్రభందకులు జె. విజయ్ కుమార్, ఔషధ శాస్త్రం ప్రొఫెసర్ ఎం. సురేష్, సూక్ష్మ జీవశాస్త్రం (మైక్రో బయాలజీ) అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సరస్వతి ఆధ్వర్యంలో జరుగుతాయని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణు గోపాల్ తెలిపారు.


రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుల బృందం

టి-20 ఛాంపియన్‌షిప్‌కు లికిత్ ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ

ఆంధ్రప్రదేశ్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ 7వ టి-20 క్రికెట్ ఛాంపియన్‌షిప్‌కు భోగాపురం మండలం సుందర పేట గ్రామానికి చెందిన కట్టిరిశెట్టి లికిత్ ఎంపికయ్యాడు. దీంతో లికిత్‌ను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తన స్వగృహంలో ఆదివారం అభినందించి క్రికెట్ కిట్, కొంత నగదును బహుకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర హరీష్, పడాల శ్రీను, గోపి, సుందర వెంకన్న, ఎంపిటిసి బంగారాజు పాల్గొన్నారు.

బీమా మంజూరు పత్రం అందజేత

భోగాపురం మండలంలోని కొయ్యపేట గ్రామానికి చెందిన బాకి సూరమ్మ భర్త ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ. 5లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం సూరమ్మకు మోపాడలోని ఎమ్మెల్యే స్వగృహంలో అందించారు.

విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే


నగదు, క్రికెట్ కిట్టును అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ : విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆదవారం పూసపాటిరేగ మండలంలో విశ్వబ్రాహ్మణులు ఏర్పాటుచేసిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొన్నారు. విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల విశ్వ బ్రాహ్మణుల కోరిక మేరకు మండలంలో గుడి నిర్మాణం కోసం స్థలాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రాథమిక సహకార బ్యాంకు అధ్యక్షులు మహంతి లక్ష్మణ్, స్థానిక సర్పంచ్ టి.సీతారాం, విశ్వబ్రాహ్మణులు, పాల్గొన్నారు.

మా బతుకులు నాశనం చేయొద్దు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని చిన్నచామలపల్లిలో నిత్యం గొర్రెలు, మేకలు మేపుకుంటున్న ప్రదేశంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి తమ బ్రతుకులను నాశనం చేయొద్దని ఆ గ్రామానికి చెందిన 150 మంది యాదవ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు ఆదివారం ఉదయం కౌలు రైతులు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఉన్న డి -పట్టా భూముల్లో గొర్రెలు, మేకలు పెంచుకొని యాదవ కుటుంబాలంతా జీవనం సాగిస్తున్నాయని ఈ భూముల్లో కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణం జరిగితే వారి జీవాలను ఎక్కడ మేపుకొని బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామంలో సుమారు 50 కుటుంబాల వరకు జీవించలేక ఇతర రాష్ట్రాలకు వలస పోయారని, ఈ కెవికె నిర్మాణం జరిగితే మిగిలిన కుటుంబాలు కూడా ఊరి వదిలి వలస పోవాల్సి వస్తుందని ఆ గ్రామ సర్పంచ్ మజ్జి భారతి, స్థానిక యాదవులు నాయకులు ఎరుక నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా గ్రామాన్ని సందర్శించి ఇక్కడ ప్రజల కష్టాలు విని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారని యాదవులు తెలిపారు. ఉన్న 150 కుటుంబాల్లో 87 కుటుంబాలకు కనీసం సెంటు భూమి కూడా లేని నిరుపేదలని, వీరంతా కొండ సమీపంలో ఉన్న భూములను సాగు చేయించుకుంటూ బతుకుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈనెల 19వ తేదీన ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. తమకు న్యాయం జరగకపోతే ఎలాంటి పోరాటానికైనా సిద్ధపడతామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న బాధితులు, రైతు, వ్యవసాయ సంఘం నాయకులు

భవనాన్ని ప్రారంభించరా..?

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని భవాని నగర్ గ్రామంలో శాశ్వత అంగన్వాడి భవనాన్ని నిర్మించి ఐదేళ్లు అయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఆ భవనాన్ని అనాథల వదిలేయడంతో ప్రజా ప్రతినిధులపై ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భవనాన్ని ప్రారంభించకపోవడం వల్ల ప్రస్తుతం అంగన్వాడి అద్దె భవనంలో నడుస్తుందని కొత్త భవనం చుట్టూ తుప్పుల పేరుకు పోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా దాని చుట్టూ అలుముకున్న రాజకీయ కోణాలను దృష్టిలో పెట్టుకొని ముందడుగు వేయలేకపోతున్నామన్నారు. జగనన్నకు చెబుదామనే కార్యక్రమం గురించి గొప్పగా చెప్పుకున్న ఈ నాయకులు ఈ చిన్న విషయం గురించి రాజకీయం చేయడం తగదని దీనివల్ల పిల్లల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా ఉందని చెబుతున్నారు. ఇకనైనా ఈ భవనాన్ని వినియోగం లోకి తీసుకు రాకపోతే గ్రామస్తులంతా ఏకమై వాడుకులోకి తీసుకొస్తామని హెచ్చరిస్తున్నారు.


ప్రారంభానికి నోచుకోని భవనం ఇదే..

రామతీర్థంలో బ్రహ్మోత్సవాల అంకురార్పణ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామతీర్థంలోని శ్రీరాముని సన్నిధిలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అంకురార్పణ చేశారు. ఏటా కన్యామాసంలో వచ్చే శ్రావణ నక్షత్రంతో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి. ఇందులో భాంగా రామతీర్థంలో ఉన్న శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామికి ఈ నెల 17 నుంచి 27 వరకు బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలి రోజు దేవాలయంలో ఆశీర్వచన మండపంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అజస్రదీపారాధన, దీక్షాధారణ, మృత్సంగ్రహణ, అంకురారోపణ కార్యక్రమాలను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహయ కమిషనర్, కార్యనిర్వాహణాదికారి బిహెచ్ఎస్ఎన్ కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మంత్రి ధర్మాన ఉపాధ్యాయుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనుక్కు తీసుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనంజయరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ సంఘాలకు, ఉపాధ్యాయ ఉద్యమానికి ఎనిమిది దశాబ్దాల చరిత్ర ఉందని ఇటువంటి చరిత్ర కలిగిన ఉపాధ్యాయ సంఘాలను అవమానపరిచే రీతిలో మాట్లాడడం మంత్రికి తగదన్నారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘాలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. చంద్రబాబు నాయడు అక్రమ అరెస్ట్, పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా ఆదివారం 5వ రోజు ఆకుల డిపో వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ రమాదేవి దంపతులు, పట్టణంలోని ధార గంగమ్మ ఫంక్షన్ హాలు వద్ద నియోజకవర్గ ఇంచార్జి కోళ్ల లలిత కుమారి రాంప్రసాద్ దంపతులు నియోజకవర్గ టిడిపి నాయకులతో వేరువేరుగా రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** నియోజక వర్గం కేంద్రంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షల్లో నియోజక వర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, సీనియర్ నాయకులు కంది చంద్ర శేఖర్‌రావు, సువ్వాడ రవి శేఖర్, మహిళా పార్ల మెంట్ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, నెల్లిమర్ల, భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, కర్రోతు సత్య నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, రాజప్పన్న, పాల్గొన్నారు.


ఎస్‌కోట: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

బొండపల్లి: చంద్రబాబుకు తోడుగా మేము సైతంలో భాగంగా గజపతినగరం నుండి విజయనగరంలో గల పైడితల్లమ్మ దేవాలయం వరకు రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆదివారం తలపెట్టిన పాదయాత్ర కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. శివరామకృష్ణను అరెస్ట్ చేసి ఆంధ్ర పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు బోని గోవింద, కరుమజ్జి కృష్ణ, మజ్జి గోవింద్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. **విజయనగరంకోట..** నగరంలోని అశోక్ బంగ్లా వద్ద టిడిపి చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఐదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడారు.

బొబ్బిలి నుంచి సింహాచలం పాదయాత్ర

బొబ్బిలి: చంద్రబాబుకు బెయిల్ రావాలని, ఆరోగ్యంగా ఉండాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని కోరుతూ బొబ్బిలి నుంచి సింహాచలం వరకూ పాదయాత్ర చేయనున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన చెప్పారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బొబ్బిలిలో ఐదో రోజు ఆదివారం సామూహిక నిరాహారదీక్షలు కొనసాగాయి. ఈనెల 22న ఉదయం బొబ్బిలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద పాదయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. పాదయాత్రగా సింహాచలం చేరుకుని సింహాద్రి అప్పన్నకు పూజలు చేస్తామన్నారు. పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వార్కి
SOP 11/2023

Between:
1. చెల్లూరి కుసమ W/o లేటు రవి, వయస్సు 41 సం॥, గృహకృత్యం, ఇంటి నెం. 5-78, మొండివీధి, జర్జాపుపేట గ్రామం, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా.
2. చెల్లూరి శిరిజ D/o లేటు రవి, వయస్సు 13 సం॥, మైనరు గార్డియన్, తల్లి కుసమ.
3. చెల్లూరి భానుతేజ S/o లేటు రవి, వయస్సు 16 సం॥, మైనరు గార్డియన్, తల్లి కుసమ.
4. చెల్లూరి ప్రకాశరావు S/o లేటు రాములు, వయస్సు 71 సం॥, - do -
5. చెల్లూరి వరలక్ష్మీ W/o ప్రకాశరావు, వయస్సు 64 సం॥, - do -

And :
Nil ......పిటిషనర్లు

నోటీసు

పై నెంబరు SOP లో 1వ పిటిషనరుకు భర్త, 2,3 పిటిషనర్లుకు తండ్రి 4,5 పిటిషనర్లుకు కుమారుడు చెల్లూరి రవి మరణించినందున శ్రీ కోర్టువారిని Succussion Certificate కొరకు పిటిషనర్లు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో ఎవ్వరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన యెడల పై కోర్టుకు **తేది 29-9-2023న ఉదయం 10-30 ని॥**లకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరయి మీ యొక్క అభ్యంతరములు తెలియజేయవలెను. లేని యెడల పరోక్షంగా తీర్మానించబడును.

శ్రీ కంటుభుక్త శ్రీనివాసరావు
అడ్వకేటు, నెల్లిమర్ల,
సెల్: 94402 82934

ఘనంగా పశువులమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి, వావిలిపాడు గ్రామాల్లో ఆదివారం పశువులమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్ వరినాట్లు పూర్తయిన తర్వాత పశువులు కష్టాలు తొలగినట్లు పశువులమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పశువులను ముస్తాబు చేసి పశువులమ్మ ఆలయం వద్దకు గ్రామంలో ఉన్న పశువులన్నింటినీ ఒకచోట చేర్చి అమ్మవారిని పశువులు చుట్టూ తిప్పించి పసుపు నీళ్లతో కలిపిన ముర్రాటను పశువులపై జల్లారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పండగను ఆయా గ్రామ సర్పంచులు బీల రాజేశ్వరి, నిరుజోగి వెంకటరావు, గ్రామ పెద్దలు బీల సతీష్, గ్రామ పంచాయతీల పాలక మండల సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.


పండగలో పాల్గొన్న గ్రామస్తులు

ఉప్పాడకు అభినందనలు

ప్రజాశక్తి- డెంకాడ

భోగాపురం మండల వైసిపి అధ్యక్షుడుగా రెండోసారి ఎంపికైన ఉప్పాడ సూర్యనారాయణను ఆదివారం సోషల్ మీడియా ప్రతినిధుల, ప్రభుత్వం మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు మండల కేంద్రంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బాకి వెంకటరావు, మండల కన్వీనర్ శీరపు వంశీరెడ్డి, అప్పన్న, సూర్యనారాయణ, సూరిబాబు, గోవింద్, వైన్ షాపు సూపర్‌వైజర్లు ఉప్పాడ సన్యాసిరావు, దల్లి రాంబాబు, అచ్యుతరావు, పల్లి అప్పలరాజు, కొల్లి గణపతి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని జికెఆర్‌పురం గ్రామానికి చెందిన గొట్టాపు జగన్మోహన్‌రావు (48) ఆదివారం తోటపల్లి కాలువలో పడి మృతి చెందాడు. మృతుని భార్య రాధ చెప్పిన వివరాలు ప్రకారం...మాది సొంత ఊరు జికెఆర్‌పురం అయినప్పటికీ బొబ్బిలిలో నివాసముంటూ చిన్న చిన్న వ్యాపారం చేసికొంటూ జీవనం కొనసాగిస్తున్నాం. ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ సమేతంగా శనివారం వినాయక చవితి కోసం సొంత ఊరు వచ్చాం. ఆదివారం ఉదయం 7 గంటలకు బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఎంత సేపటికి రాకపోవడంతో ఊరు వాళ్లంతా వెతికారు. చివరికి తోటపల్లి కాలువ వైపు వెళ్లి పడిపోయాడని గ్రామానికి చెందిన దేవర కృష్ణ, సత్తిబాబు చూసి తీసేసరికి చనిపోయాడని తమకు చెప్పినట్లు రాధ తెలిపారు. దీనిపై ఎస్ఐ జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు దుకాణాలు దగ్ధం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్ సమీపంలోని గొలగాం గ్రామానికి చెందిన షేక్ గౌరీ పాన్‌షాప్, అమకాం పంచాయతీ దుబ్బగుడ్డి గ్రామానికి చెందిన కొల్లుబోయిన రాజ్‌కుమార్ చికెన్ షాపులకు గుర్తు తెలియన వ్యక్తులు శనివారం అర్ధరాత్రి నిప్పంటించారు. దీంతో ఈ రెండు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. షేక్ గౌరీకి సుమారు రూ. 1.50లక్షలు, రాజ్‌కుమార్‌కు రూ. 50వేలు వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ మహేష్ ఆదివారం ఉదయం పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.


దగ్ధమవుతున్న దుకాణం

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని గొల్లాది మామిడి తోటలో ఐదుగురు కోడి పందేలాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ జయంతి తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 3100, 5 కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా వివిధ గ్రామాలకు చెందిన వారని ఇక్కడ తోటల్లో కోడి పందేళ ఆడుతూ పట్టుబడ్డారని చెప్పారు.